# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 173 | శనివారం, 23 మే 2026 | పేజీలు : 4




# రెక్కల కష్టం బుగ్గిపాలు



## ప్రమాదవశాత్తు పంటలు దగ్ధం

- గబ్బెటలో వరి పంటలు, ఆగాపేటలో మొక్కజొన్న..

చేతికొచ్చిన పంట కళ్లముందే బూడిదవుతుంటే ఏం చేయలేక రైతులు లబోదిబోమంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. జనగామ జిల్లాలో శుక్రవారం వేరువేరు చోట్ల జరిగిన అగ్నిప్రమాదాలు రైతులకు తీరని నష్టం వాటిల్లింది. రఘునాథపల్లి మండలం గబ్బెటలో వరి పంటలు కాలిపోగా.. నర్మెట మండలం అగాపేట శివారులో 3 ఎకరాల మక్కజొన్న అగ్నికి ఆహుతయ్యింది. - రఘునాథపల్లి/నర్మెట, మన చౌరాస్తా

3 లో

## సమిష్టి కృషితోనే అభివృద్ధి

- ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలే కేంద్రబిందువు
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

4 లో





## నమ్ముకున్న దేవుడు.. నట్టేట ముంచాడని..

- దేవుడిపై కోపంతో కొడుకుతో సహా పూజారి ఆత్మహత్య
- పూజలు నిష్ప్రయోజనమయ్యాయని ఆవేదనతోనే..
- 15 ఏళ్ల క్రితం అమ్మను.. నెల క్రితం భార్యను మాయం చేశాడని కోపం అఘాయిత్యం
- లింగాలఘణపురం బండ్లగూడలో ఘటన



ఊరంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ధర్మమార్గం పరిఢవిల్లాలని నిత్యం పూజలు చేస్తూ భక్తిమార్గాన్ని నమ్మిన తనకే దేవుడు తీరని అన్యాయం చేశాడని ఓ అర్చకుడు ఆవేదనకు లోనయ్యాడు.. నిత్యపూజలతో నైవేద్యాన్ని సమర్పించే తనకే అన్నంపెట్టే తోడు లేకుండా చేశాడని మనస్థాపానికి గురయ్యాడు.. అంతే కాదు.. కన్నతల్లిని.. కట్టుకున్న భార్యను తనకు దూరం చేసి తనపై ఇంకేం కక్ష సాధించగలవని దేవుడిపై కోపం పెంచుకున్న పూజారి వరయూరు లక్ష్మినర్సింహ్మాచార్యులు(54), అతని కుమారుడు వరయూరు పవన కుమారాచార్యులు(25)తో కలిసి నిత్యం పూజలు చేసే దేవాలయ నీటిగుండంలోనే దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన లింగాలఘణపురం మండలం బండ్లగూడెం శివారులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. - మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

2



## ఆధిపత్యాన్ని ప్రశ్నించే శక్తి సాహిత్యానిదే..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

4 లో



# నమ్ముకున్న దేవుడు.. నట్టేట ముంచాడని..

- దేవుడిపై కోపంతో కొడుకుతో సహ పూజారి ఆత్మహత్య
- 15 ఏళ్ల క్రితం అమ్మను.. నెల క్రితం భార్యను మాయం చేశాడని కోపంతోనే అఘాయిత్యం
- లింగాలఘణపురం మండలం బండ్లగూడలో విషాదం

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** ఊరంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ధర్మమార్గం పరిఢవిల్లాలని నిత్యం పూజలు చేస్తూ భక్తిమార్గాన్ని నమ్మిన తనకే దేవుడు తీరని అన్యాయం చేశాడని ఓ అర్చకుడు ఆవేదనకు లోనయ్యాడు.. నిత్యపూజలతో నైవేద్యాన్ని సమర్పించే తనకే అన్నంపెట్టే తోడు లేకుండా చేశాడని మనస్థాపానికి గురయ్యాడు.. అంతే కాదు.. కన్నతల్లిని.. కట్టుకున్న భార్యను తనకు దూరం చేసి తనపై ఇంకేం కక్ష సాధించగలవని దేవుడిపై కోపం పెంచుకున్న పూజారి వరయూరు లక్ష్మినర్సింహ్మాచార్యులు(54), అతని కుమారుడు వరయూరు పవన కుమారాచార్యులు(25)తో కలిసి నిత్యం పూజలు చేసే దేవాలయ నీటిగుండంలోనే దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన లింగాలఘణపురం మండలం బండ్లగూడెం శివారులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళితే.. లింగాలఘణపురం మండలకేంద్రంలో గడిచిన 40 ఏళ్లుగా నివాసముంటూ బండ్లగూడెం శివారులోని బం డగుట్ట లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయంలో నిత్యపూజారిగా జీవనం సాగిస్తున్నాడు. తాను ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోయినా గ్రామస్థుల విరాళాలతో స్వామివారికి నిత్యపూజలు చేస్తూ ఇంటిల్లిపాదిన పోషిస్తున్న అర్చకుడు లక్ష్మీనర్సింహ్మాచార్యులుకు అనూహ్యంగా నెలరోజుల క్రితం భార్య శ్రీదేవి అనారోగ్యంతో చనిపోయింది. అప్పటిదాకా తాను గుడికి మాత్రమే పరిమితమై ఉంటుండగా పూర్తి స్థాయిలో ఇం టి బాధ్యతలు చూసుకునే భార్య చనిపోవడం తన ఒక్కగానొక్క కుమారుడు పవన్‌కుమార్ నిమిత్తమాత్రుడు కావడంతో తీవ్ర మనోవేధనకు గురయ్యాడు. సరిగ్గా 15 ఏళ్ల క్రితం తల్లి నీటిగుండంలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన పూర్తిగా మరిచి పోకముందే భార్య శ్రీదేవి అనారోగ్యంతో మృతి చెందడంతో లక్ష్మీనర్సింహ్మాచార్యులుకు భవిష్యత్ ప్రపంచం చీకటిమయంగా ఊహించుకున్నాడు. తన కొడుకుకు పెద్దగా లోకజ్ఞానం తెలియదని అన్నీ నమ్ముకున్న దేవుడే తనకు తీరని అన్యాయాన్ని మూటగట్టాడని తనకు మృత్యువే శరణ్యమని పలుమార్లు గ్రామస్తులతో తన ఆవేదనను వెలిబుచ్చాడు.



అయితే కాలం చేసిన గాయాలను కాలమే మాన్పుతుందని, అధైర్యపడొద్దని తామంతా అండగా ఉంటామని గ్రామస్తులు అర్చకుడికి ఎంత నచ్చచెప్పినా వినకుండా అనుకున్నట్లుగా తన కొడుకు పవన్‌కుమార్‌తో కలిసి శుక్రవారం నీటిగుండంలో దూకి ఆత్మహత్యకు పాల్పడటం గ్రామస్తుల హృదయాలను తీవ్రంగా కలచివేసింది.

## ఇంటిల్లిపాది మృతి...

40 ఏళ్లుగా పౌరోహిత్యమే జీవనాధారంగా కాలం వెళ్లదీస్తున్న లక్ష్మీనర్సింహ్మాచార్యులు కుటుంబానికి ఇన్నాళ్లు సొంతిల్లు లేకపోగా అద్దె ఇంట్లో నివాసముండేవాడు. ఇటీవలే ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయగా గ్రామస్తుల చేదోడువాదోడు ఇంటిని 90 శాతం పూర్తి చేసుకున్నాడు. భార్యతో కలిసి సొంతింటి కలనెరవేరబోతుందని ఆనందాన్ని కూడా పంచుకున్నారు. మరో నెలలో పాలుపొంగించి నూతన గృహప్రవేశం చేద్దామనుకునే లోపే అనారోగ్యం బారిన పడ్డ భార్య శ్రీదేవి ఏప్రిల్ 16న మృతిచెందింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మీనర్సింహ్మాచార్యులకు గ్రామస్తులు అండగా నిలిచి ఆర్థిక సాయం చేయగా భార్య అంత్యక్రియలను పూర్తి చేశారు. ఇక అప్పటి నుం చి పూర్తిగా మనోస్థైర్యాన్ని కోల్పోయిన లక్ష్మీనర్సింహ్మాచార్యులుకు కనీసం వంట చేయడం, బట్టలు ఉతకడంలాంటి పనులు తండ్రీ కొడుకులిద్దరికీ రాకపోవడంతో చని పోవడమే మార్గంగా ఎంచుకున్నారు.

## మద్యం బాటిల్తో వచ్చి..

చావడం ఎవరికైనా అంతసులువైన మార్గం కాదని అందరికీ తెలుసు.. అందులోనూ తండ్రీ కొడుకులు ఇద్దరు ఆత్మహత్యకు సిద్ధపడి నీటిగుండంలో దూకాలనుకున్నారో ఏమో.. ధైర్యం చాలక తమ వెంట మద్యం ఫుల్ బాటిల్‌ను తెచ్చుకున్నారు. తీరా గుం డం వద్దకు చేరుకున్నాక మద్యం తాగకుండానే ధైర్యాన్ని కూడగట్టుకుని ఆత్మహత్యకు తెగించారని స్థానికులు పేర్కొంటున్నారు.

## పరిశీలించిన డీసీపీ..

నీటిగుండంలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సమాచారం అందుకున్న జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నీటిగుండంలో ఉన్న మృతదేహాలను పరిశీలించగా అప్పటికే రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. పూర్తిగా కుళ్లిన మృతదేహాలు నీటిపై తేలియాడుతూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఫింగర్ ప్రింట్ క్లూస్ టీం ఆధారాలను రికార్డు చేసుకున్న అనంతరం మృతదేహాలను జనగామ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. మృతులకు అంతిమసంస్కారాలను నిర్వహించేందుకు గ్రామస్తులే రెడీ అవుతున్నారు.



# నీడపట్టున ఉండి పనిచేయండి

### – ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ సూచన

**లింగాల ఘణపురం, మన చౌరాస్తా :** వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లుట్ల గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ సూచించారు. శుక్రవారం నెల్లుట్ల గ్రామంలోని హమాలీ కూలీలు, అలాగే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) పథకం కింద పని చేస్తున్న ఉపాధి కూలీల వద్దకు ఆయన స్వయంగా వెళ్లారు. మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి బి. అనిల్ రాజ్, వార్డు సభ్యులు కొయ్యడ అనిల్, వేల్పుల శోభారాణి, గోరిగే సందీప్, బొజ్జం సునీత ప్రభాకర్, నల్ల అజయ్, వంగ సతీష్, బత్తిని వేణు గౌడ్, గొరిగే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ చేస్తున్నరు

**జాఫర్‌గడ్, మన చౌరస్తా:** మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు, తీవ్ర ఆలస్యం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ జాఫర్‌గడ్ మండల ప్రధాన కార్యదర్శి అన్నెపు రమేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తరుగు దోపిడీని అరికట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు అబ్బురబోయిన యాకస్వామి, మారేపల్లి రవి, గిరగొని యాదగిరి గౌడ్, అలిమ మధు తదితరులు పాల్గొన్నారు.



# పెన్సిల్ ఆర్ట్‌కు జనగామ డీసీపీ ఫిదా

- **గురుకుల విద్యార్థిని అభినందించిన రాజమహేంద్ర నాయక్**

**జనగామ, మన చౌరాస్తా:** సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సృజన్, జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్ చిత్రాన్ని పెన్సిల్‌తో గీసి అందజేశాడు. చిత్రాన్ని పరిశీలించిన డీసీపీ సృజన్ ప్రతిభను అభినందించారు. చదువుతో పాటు చిత్రలేఖనంలో కూడా ముందుకు వెళ్లాలని సూచించారు. భవిష్యత్తులో అవసరమైన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. సృజన్‌లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన గురువు కాసాల సంతోష్ కుమార్‌ను కూడా డీసీపీ అభినందించారు. సృజన్ తండ్రి నర్సింగరావు మేస్త్రీగా, తల్లి స్వప్నప్రియ టీవీఎస్ షోరూమ్‌లో పనిచేస్తున్నారు.








# రైతు రెక్కల కష్టం బుగ్గిపాలు

- **గడ్డివాముకు మంటలు అంటుకుని పంటలు దగ్ధం**
- **కాలిపోయిన మోటార్లు, కేబుళ్లు, స్టార్టర్లు**
- **రఘునాథపల్లి మండలం గబ్బెటలో ఘటన**

**రఘునాథపల్లి, మన చౌరాస్తా:** మండల పరిధిలోని గబ్బేట గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదం పలువురు రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. గ్రామ శివారులోని కాటమయ్య గుడి సమీపంలో గడ్డివాముకు మంటలు అంటుకోవడంతో గాలి వేగానికి మంటలు సమీపంలోని వ్యవసాయ పొలాలకు వ్యాపించాయి. మంటల ఉధృతికి పొలాల్లో నిల్వ ఉంచిన గడ్డి కట్టలు, కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట, ధాన్యపు రాశులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రంగు శ్రీనివాస్, పోషబోయిన కొమురయ్య, కోతి సోమయ్య తదితర రైతులకు చెందిన మోటార్లు, బోర్ కేసింగ్‌లు, కేబుళ్లు, స్టార్టర్లు కాలిపోయాయి. గంగసాని అరవింద్ రెడ్డికి చెందిన ధాన్యం కుప్పలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి.

## 30 మంది రైతులకు నష్టం..

తాళ్లపల్లి రాజు కష్టపడి కోసి నిల్వ ఉంచిన 40 బస్తాల ధాన్యం బూడిదైంది. కొడిశాల పరశురాములు, తాళ్లపల్లి యాకస్వామి పంటలు కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు 30 మందికి పైగా రైతులు నష్టపోయినట్లు సమాచారం. స్థానిక రైతులు, గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీ నష్టం జరిగింది. బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అగాపేట 3 ఎకరాల మొక్కజొన్న

**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట్ట మండలం అగాపేట శివారులో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో రైతుకు భారీ నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు చిల్లంకురి వసంత కౌలు సాగు చేస్తున్న సుమారు 3 ఎకరాల మక్కజొన్న చేను మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది.స్థానికుల సమాచారం మేరకు ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో పంట మొత్తం అగ్నికి ఆహుతైంది. ప్రమాదం గమనించిన గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలానికి చేరుకొని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. అయితే అప్పటికే పంట పూర్తిగా దగ్ధమై సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వసంత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి తగిన పరిహారం అందించాలని రైతు కుటుంబం కోరుతోంది. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.



# కేంద్రం ఫండ్స్‌తో మూడు మెగా ప్రాజెక్టులు

- **తెలంగాణకు రూ.5,681 కోట్ల అర్బన్ చాలెంజ్ నిధులు**
- **వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో అభివృద్ధి పనులు**
- **కేంద్ర మంత్రి సంజయ్ వెల్లడి**



**వరంగల్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అర్బన్ చాలెంజ్ ఫండ్(యూసీఎఫ్) కింద రూ.5,681 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ నిధులతో వరంగల్, కరీంనగర్, ఖమ్మం ప్రాంతాల్లో మూడు మెగా ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వరంగల్ మురుగునీటి పారుదల వ్యవస్థ ఆధునీకరణకు రూ.4,674 కోట్లు, కరీంనగర్ మోడల్ రోడ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.840 కోట్లు, కారిడార్ అభివృద్ధికి రూ.166 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

## కరీంనగర్‌లో స్కైవాక్‌లు..

కరీంనగర్ ప్రాజెక్టు కింద మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు నగరాల ముఖచిత్రాన్ని మార్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌ను ఈ పథకంలో చేర్చేందుకు తాను వ్యక్తిగతంగా కృషి చేశానని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం ఉందని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందన్నారు.

# మైనింగ్ తో పర్యావరణానికి నష్టం

**– వానకొండయ్య గుట్టపై అనుమతులు రద్దు చేయాలి**

**– డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ**

జనగామ, మన చౌరస్తా: దేవరుప్పుల మండలం లకవత్ తండా పంచాయతీ పరిధిలోని వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట ప్రాంతంలో మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని జనగామ డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మైనింగ్ వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. భూగర్భ జలాలు, పంట భూములు, ప్రకృతి వనరులు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఉనికి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ప్రజల మనోభావాలు, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# తరుగు పేరుతో కోత పెట్టొద్దు: బీజేపీ

భీమదేవరపల్లి, మన చౌరాస్తా: మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వడ్ల కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, తరుగు -తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ కేంద్రాల్లో అవసరమైన లారీలను సమకూర్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఇప్పటికే ధాన్యం విక్రయించిన రైతులకు నెలలు గడిచినా చెల్లింపులు జరగలేదని, వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# బహుజన రాజ్యాధికారమే టీఆర్పీ లక్ష్యం

**జనగామ, మన చౌరాస్తా :** బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)ని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడానికి కృషి చేయనున్నట్లు ఆ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం తెలిపారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్ల సదానందం మాట్లాడుతూ ప్రతి ఇంటా పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో కమిటీలు వేస్తామని, విద్యార్థి, కార్మిక, మహిళా, యువజన విభాగాలను బలోపేతం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్, మురళి బైండ్ల, యూత్ జిల్లా అధ్యక్షులు మంద దిలీప్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి బబ్బులు, పట్టణ అధ్యక్షులు గడ్డం కృష్ణ, యూత్ మండల అధ్యక్షులు ముక్క విష్ణువర్ధన్, లింగాల గణపురం మండల అధ్యక్షులు శాడ నరేష్, ప్రధాన కార్యదర్శి ఆకుల నర్సింహులు, రఘునాథపల్లి మండల అధ్యక్షులు అశోక్ శంకరి గౌడ్, నర్మెట మండల అధ్యక్షులు శ్రీకాంత్, జలీల్ పాషా, శివార్ల ఎలేందర్ పాల్గొన్నారు.

# సమిష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి

- ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలే కేంద్రబిందువు
- ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, మన చౌరాస్తా : అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే జిల్లా ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ఆరంభించి, రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడం, స్థానిక అవసరాలు, ప్రాధాన్యతలను నేరుగా తెలుసుకొని అభివృద్ధి కార్యాచరణ రూపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)" కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు తమ విలువైన సమయాన్ని కేటాయించి, హాజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల హాజరు కేవలం కార్యక్రమంలో పాల్గొనడం మాత్రమే కాదని, అది ప్రభుత్వం, ప్రజల మధ్య ఉన్న నమ్మకానికి, బాధ్యతాయుత పాలనకు ప్రతీక అని చెప్పారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అనేది కేవలం పరిపాలనా కార్యక్రమం కాదని, ఇది ప్రజాస్వామ్య పాలనకు ఒక ఆచరణాత్మక రూపమని అన్నారు. రాష్ట్ర ప్రగతికి స్పష్టమైన మార్గదర్శకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి మూడు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. మొదటిది ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, రెండవది జిల్లా స్థాయిలో ప్రజల సమస్యలు, అవసరాలు, ప్రాధాన్యతలను నేరుగా తెలుసుకోవడం, మూడవది భవిష్యత్తు అభివృద్ధి మార్గాన్ని ప్రజలతో కలిసి రూపొందించడం అని తెలిపారు. ఈ వేదిక ఏకపక్ష ప్రసంగాల కోసం కాదని, ప్రభుత్వం ప్రజల మధ్య సార్థక సంభాషణకు అవకాశం కల్పించే వేదిక అని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరిస్తూ, రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ, వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అన్నదాత ఎప్పుడూ ఒంటరిగా ఉండకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం రైతుల వెంటే నిలుస్తోందన్నారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈగల్ టీమ్ (Eagle Team) ద్వారా డ్రగ్స్‌కు సంబంధించిన కార్యకలాపాలను గుర్తించి, నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి కాలంలో మరో పెద్ద సవాలు సైబర్ నేరాలు అని, మొబైల్, సోషల్ మీడియా, ఫేక్ లింకులు, ఫేక్ లోన్ యాప్స్ వంటి వాటి ద్వారా ప్రజలు మోసపోతున్నారని, అందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. తదనంతరం బ్యాంకు లింకేజ్ కింద స్వయం సహాయక సంఘాలకు రూ. 58,15,93,000 చెక్కును అందించారు. అలాగే ఆగ్రో ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ కోసం మహిళా సమాఖ్యలకు రూ. 61,36,200 చెక్కును అందించారు. అదే విధంగా జీలుగు విత్తనాల గ్రిడ్ కోసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను వారు అందించారు. చివరగా, జిల్లాలోని వివిధ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి సమస్యలపై చర్చించారు. ఇందులో భాగంగా.. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, బోధన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని, అంగన్వాడీ కేంద్రం, ఓహెచ్ఆర్ ట్యాంకు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, సీసీ రోడ్లు, కెనాల్ వంతెన సమస్యలపై ధర్మాగంట తండా గ్రామం, దేవరుప్పుల మండలానికి చెందిన అరుణ కోరారు. అందుకు గాను పీఎం గ్రామ సడక్ యోజన కింద సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారికి సూచించారు. అదే విధంగా దేవరుప్పుల సర్పంచి కృష్ణమూర్తి గౌడ్ మహిళా సంఘం భవనానికి నిధులు విడుదల చేయాలని, అలాగే ధ్యాయం కొనుగోలులో బస్తాల తూకం సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# అంతర్‌రాష్ట్ర దొంగలపై నిఘా

## రైల్వే స్టేషన్లలో పోలీసుల తనిఖీలు

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత కొద్ది రోజులుగా ఇతర రాష్ట్రాలు నుండి ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన నేరగాళ్ళు ఇండ్ల చోరీలతో పాటు,చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ కావడం,ముఖ్యంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ కేంద్ర బిందువుగా వరంగల్,కాజీపేట రైల్వే స్టేషన్లు మారడంతో నేరగాళ్ళు రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోని పలు చోరీలకు పాల్పడటం,అనంతరం నిందితులు ఇదే రైలు మార్గం ద్వారా తిరిగి వారి స్వస్థలాలకు చేరకుంటున్నారు. ఇలాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అంతర్ రాష్ట్ర దొంగలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు.ఇందులో భాగంగా అంతర్‌రాష్ట్ర దొంగలను ముందుగా గుర్తిండం అలాగే చోరీల కట్టడికై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా క్రైమ్స్ అదనపు డిసిపి బాలస్వామి,సిసిఎస్ ఏసిపి సదయ్య అధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది.రెండు బృందాలు చోప్పున వరంగల్,కాజీపేట రైల్వే స్టేషన్లలో ప్రభుత్వ రైల్వే పోలీసులు,రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో విధులు నిర్వహిస్తారు. దేశంలోని వివిధ మార్గాల ద్వారా ముఖ్యంగా ఉత్తర భారత దేశం నుండి వరంగల్,కాజీపేట రైల్వే స్టేషన్లలో ఆగే రైళ్ళలో ఇక్కడకి చేరుకున్న ప్రయాణికుల్లో ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత ప్రయాణికులను గుర్తించి వారిని,వారి సామగ్రిని సైతం కుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వారి నుండి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత వ్యక్తుల సంబంధిత వ్రేలి ముద్రలు, ముఖాలను ఫేస్ రికగ్నైజేషన్‌తో పాటు పోలీసుల వద్ద వున్న ఆధునిక పరిజ్ఞానంతో దేశంలోని నేరస్థులకు సంబంధించిన డాటా బెస్‌తో అనుసంధానం చేసి సంబంధిత అనుమానిత వ్యక్తులను పరీక్షంచడం జరుగుతుంది.ఈ తనిఖీల్లో ఒక వేళ తనిఖీ చేసిన వ్యక్తి గతంలో ఏదైన నేరానికి పాల్పడినట్లయితే క్షణాల్లో పోలీసులు వినియోగిస్తున్న టెక్నికల్ డివైజ్‌కు అనుమానితుడి పూర్తి వివరాలు చేరిపోతాయి.దీనితో తక్షణమే పోలీసులు అప్రమత్తమై సదరు అనుమానితులను అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది.ఇదే సమయంలో ఈ బృందాలు తనిఖీలు చేసే సయమంలో అనుమానిత పూర్తి వివరాలను సైతం రికార్డుల రూపం భద్రపర్చడం జరుగుతుంది.నలుగురు సభ్యులు వున్న ప్రత్యేక బృందంలో ప్రతి రైల్వే స్టేషన్‌ల్లో షిఫ్ట్‌ల వారిగా విధులు నిర్వహిస్తు నిరంతరం అనుమానితులను తనిఖీలు నిర్వహిస్తూ అంతరాష్ట్ర దొంగలకు చెక్ పెడుతున్నారు.

# ఆధిపత్యాన్ని ప్రశ్నించే శక్తి సాహిత్యానిదే..

- ఎంపీ డాక్టర్ కావ్య



**హనుమకొండ, మన చౌరాస్తా :** సమాజాన్ని చైతన్యపరిచే శక్తి సాహిత్యానికి ఉందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. కాకాజీ అడ్వకేట్స్ కాలనీలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "కవిత్వంతో కలుద్దాం" కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ ప్రతి సామాజిక ఉద్యమాన్ని అందుకునే తొలి సాహిత్య రూపం కవిత్వమని అన్నారు. పోరాటాల కేంద్రంగా పేరుగాంచిన వరంగల్ సాహిత్య ఉద్యమాల్లో కూడా అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అధిపత్య ధోరణులను ప్రశ్నించే శక్తి సాహిత్యానికి ఉందని తెలిపారు. కవులు, రచయితలు తమ కలం ద్వారా సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. యువతలో పఠనాభిరుచి, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు ఇటువంటి కవి సమ్మేళనాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు తమ కవితలను వినిపించారు.



# భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ దళిత ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు, ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ దళిత ఉద్యమ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పిస్తూ, సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**